క్లుప్తంగా

అర్హతే ప్రామాణికం



జేవీడీ దరఖాస్తులను పరిశీలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ

దొర్నిపాడు: జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాల అమలుకు అర్హతే ప్రామాణికమని ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయం–2లో జేవీడీ దరఖాస్తులను పరిశీలించారు. మండలంలో 595 దరఖాస్తులు రాగా 433 దరఖాస్తులు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త గది, డార్మెట్రీ ,పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని వార్డెన్ రాముడుకు సూచించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్ నాయక్,జూనియర్ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి



మాచినేనిపల్లెలో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి

రుద్రవరం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ఎర్రగుడిదిన్నె పంచాయతీ మజరా గ్రామమైన మాచినేనిపల్లె లే అవుట్‌లో సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు, పైప్‌లైన్ పనులను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేసేలా పనులు చేపట్టాలని చెప్పారు. కాలనీలో తగిన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. ముందుగా తాగునీటి సౌకర్యం కల్పించేందుకు పైప్‌లైన్ పనులు సాగుతున్నాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఏపీఓ రవిప్రకాష్

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్య పెంచేందుకు క్షేత్రస్థాయిలో సమష్టి బాధ్యతతో పని చేయాలని ఆ శాఖ ఏపీఓ రవిప్రకాష్ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు 2,800 మంది కూలీలు పాల్గొనేలా లక్ష్యాన్ని నిర్దేశించారని, ప్రస్తుతం రోజుకు 1,008 మంది మాత్రమే పనుల్లో పాల్గొంటున్నారు. సుద్దమల్ల, సర్వాయిపల్లె, రూపనగుడి, బోడెమ్మనూరు గ్రామాలలో 20 శాతంలోపే కూలీలు హాజరవుతుండడంపై ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల సంఖ్య పెంచేందుకు శ్రమించాలని ఆదేశించారు.


మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అన్ని రంగాల్లో మండలాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు పారిశుద్ధ్యం, మంచినీటి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఉప మండలాధ్యక్షులు ప్రసాద్, దాదాపీర్ ఉన్నారు.

ప్రహ్లాద్‌కు ఐకాన్ పురస్కారం



ప్రహ్లాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): శానిటరీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సిపాయి కమిషన్ సభ్యుడు బాయికాటి ప్రహ్లాద్ ఇండియన్ ఐకాన్ పురస్కారం అందుకున్నారు. జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి హైదరాబాద్‌కు చెందిన విజ్డమ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం సాయంత్రం 50 మంది ప్రముఖులకు ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డ్స్–2023ను అందజేశారు.

రాయితీ ఫలం.. ఉద్యానవనం

- ఉద్యానవన పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం
- జిల్లాలో 1.04లక్షల హెక్టార్లలో తోటల సాగు
- ఆధునిక యంత్రాల కొనుగోలుకూ సహకారం
- కరువు ప్రాంతాల్లో నీటి కుంటల తవ్వకానికీ చేయూత
- నాటినప్పటి నుంచి మూడు నుంచి నాలుగేళ్ల పాటు పరిరక్షణ సాయం

రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం వివిధ రకాల చర్యలు చేపట్టింది. సంప్రదాయ పంటలను నమ్ముకున్న అన్నదాతలు ఉద్యానపంటలు సాగు చేసేలా రాయితీలు అందజేసి ప్రోత్సహిస్తోంది. అలాగే పాత తోటల పునరుద్ధరణ, నీటి కుంటలు తవ్వుకోడానికి కూడా సాయం చేస్తుంది. మొక్కలు నాటినప్పటి నుంచి మూడు నుంచి నాలుగేళ్ల పాటు పరిరక్షణకు ఆర్థిక సాయం అందజేస్తుంది. కేవలం పండ్ల తోటలే కాకుండా పూలు, కూరగాయల సాగుకు కూడా సహకారం ఇస్తోంది. ఇక దిగుబడులను శుభ్రం చేయడం, గ్రేడింగ్, ప్యాకింగ్, శీతల గదులు, శీతల గిడ్డంగుల నిర్మాణాలకు కూడా చేయూతనిస్తోంది. చివరకు రైతులు ఆధునిక యంత్రాలను సమకూర్చుకోవడానికి కూడా సబ్సిడీ ఇస్తుంది.



బొప్పాయి పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



డోన్‌లో సాగు చేసిన దానిమ్మ పండ్ల తోట

నంద్యాల: జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి అనుకూలమైన నేలలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 1,04,744 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు ఉద్యానవన పంటలు సాగు చేస్తూ 15,16,158 మెట్రిక్ టన్నుల దిగుబడిని తీస్తున్నారు. వీటిలో ప్రధానంగా నిమ్మ, మామిడి, బత్తాయి, బొప్పాయి, సపోట, జామ వంటి పండ్ల తోటలు అధికంగా ఉన్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహం..

ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రూ.4.36 కోట్లతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. పండ్ల తోటల విస్తరణ పథకం కింద నిమ్మ, మామిడి, బత్తాయి, టిష్యూ కల్చర్, అరటి, బొప్పాయి, జామ తోటలను చేపట్టేందుకు 40 శాతం రాయితీ కల్పించింది.

విడి పూల పెంపకం..

మల్లె, చామంతి, కనకాంబరం, బంతి, లిల్లీపూల పెంపకానికి చిన్న, సన్నకారు రైతులకు మొత్తం ఖర్చులో 40 శాతం రాయితీగా ఒక హెక్టారుకు రూ.16వేల వంతున ప్రభుత్వం అందజేస్తుంది. ఇతర రైతులకు (పెద్ద రైతులు) మాత్రం 25 శాతం రాయితీగా అంటే ఒక హెక్టారుకు రూ.10 వేలు సాయం చేస్తుంది.

మరిన్ని రాయితీలు..

పంట కోత అనంతరం వాషింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్‌లను సమర్థవంతంగా చేపట్టేందుకు, ప్యాక్ హౌస్ నిర్మాణం కోసం గరిష్టంగా రూ.2 లక్షలు రాయితీ ఇస్తుంది. శీతల గది, శీతల గిడ్డంగులు, పండ్ల మాగబెట్టుకునే గదులకు, మార్కెటింగ్ మౌలిక వసతులకు బ్యాంకు లింకేజీ ద్వారా 35 శాతం రాయితీ లభిస్తుంది. ఉద్యాన యాంత్రీకీకరణ పరికరాల కొనుగోలుపై చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. కరువు పరిస్థితుల్లో ఉద్యాన పంటలను సరక్షించుకునేందుకు నీటి కుంటలు తవ్వుకుంటే రైతుకు గరిష్టంగా రూ.75 వేలు రాయితీ అందజేస్తుంది.

సంకర జాతి కూరగాయలు..

సంకర జాతి కూరగాయలు పండించే ఒక రైతుకు గరిష్టంగా రెండు హెక్టార్ల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. మొత్తం ఖర్చులో 40 శాతం రాయితీగా వస్తుది. సాగులో కలుపు నివారణకు ఒక హెక్టారుకు 50 శాతం రాయితీ కింద అందజేస్తుంది.

పాత తోటల పునరుద్ధరణ..

20 సంవత్సరాల వయస్సు దాటిన మామిడి తోటలకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద ఒక హెక్టారుకు రూ.17,500 ప్రభుత్వం రాయితీ ఇస్తుంది.

ఉచితంగా మొక్కలు పరిరక్షణకు ప్రోత్సాహం..

పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఐదు ఎకరాల లోపు భూములున్న సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగా మొక్కలు అందిస్తుంది. గుంతలు తీయడం, మొక్కలు నాటడం దగ్గర నుంచి వాటి పరిరక్షణకు ప్రభుత్వం రైతులకు నగదు అందజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఎకరాలో నిమ్మ, మామిడి, బత్తాయి, జామ తోటలు పెంచేలా జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు ప్రణాళిక రూపొందించారు. రైతులు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి అర్హులను గుర్తిస్తారు. ఇందుకోసం రైతులు అడంగల్, వన్‌బీ, ఆధార్ జిరాక్స్, బ్యాంకు అకౌంట్ పాసుపుస్తకం, జాబ్‌కార్డు సన్న, చిన్నకారు రైతు పత్రాలు ఉండాలి.ఉపాధి హామీకి సంబంధించి జాబ్‌కార్డు కలిగి ఉండాలి.

మూడు నుంచి నాలుగేళ్ల పాటు పరిరక్షణకు ఆర్థిక సాయం వివరాలు..

పంట పేరు	మొదటి ఏడాది	రెండో సం:	మూడో సం:	మొత్తం
మామిడి	7,980	2,660	2,660	13,300
నారింజ	9,602	3,201	3,201	16,004
జామ	17,599	5,866	5,866	29,331
దానిమ్మ	16,004	5,334	5,344	26,672
అరటి	30,739	10,246	–	40,985
బొప్పాయి	18,497	6,165	–	24,662

కోరుకున్న మొక్కలు తెచ్చుకోవచ్చు



రైతులు వారు కోరుకున్న ప్రాంతం నుంచి మొక్కలు కొనుగోలు చేసుకొని తెచ్చి నాటుకోవచ్చు. అందుకు సంబంధించిన నగదు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా ప్రభుత్వం జమ చేస్తుంది. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణకు అయ్యే ఖర్చును మూడేళ్ల పాటు రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. పండ్ల తోటలను పెంచాలనుకున్న రైతులు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదిస్తే వారికి అవసరమైన సమగ్ర సమాచారం అందజేస్తారు. జిల్లాలోని సన్న, చిన్నకారు రైతులకు రాయితీలు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసి కలెక్టర్ ఆమోదం కూడా తీసుకున్నాం. – నాగరాజు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, నంద్యాల

రాష్ట్రాభివృద్ధిలో జర్నలిస్టులది కీలక పాత్ర



కొమ్మినేని శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల: రాష్ట్ర అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శ్రీ రామకృష్ణ పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో సర్టిఫికెట్ కోర్సు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జర్నలిజం అనేక ఆటుపోట్లను ఎదుర్కుంటోందన్నారు. ఇటీవల సోషల్, డిజిటల్ మీడియా కూడా విస్తారంగా ప్రచారంలోకి వచ్చాయన్నారు. కొన్నిసార్లు మెయిన్ మీడియా ఇవ్వని వార్తలు, సోషల్ మీడియా, డిజిటల్ మీడియాలో వచ్చేస్తున్నాయని చెప్పారు. ప్రెస్ అకాడమీ సెక్రెటరీ బాలగంగాధర తిలక్, రామకృష్ణారెడ్డి, దస్తగిరి పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు

ఉయ్యాలవాడ : సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు చేపట్టిన సర్వే వేగవంతం చేయాలని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని అధిగమించడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువగానున్న పిల్లలను గుర్తించి ఎదుగుదలకు పటిష్ట ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు సమష్టిగా మూడు రోజుల్లో సర్వే పూర్తి చేయాలని కోరారు. హెల్త్ సూపర్‌వైజర్లు దస్తగిరి, కృష్ణ, ఐసీడీయస్ సూపర్‌వైజర్ లక్ష్మిశైలజ, ఏపీఎం శేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక



మధులత

నంద్యాల(అర్బన్): గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసు అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షురాలిగా అనుమల మధులత ఎన్నికయ్యారు. మహిళా పోలీసుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ విలేజ్ వార్డు సెక్రటరీయేట్ మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటును చేసింది. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జిల్లా అడహక్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నంద్యాల జిల్లాకు చెందిన కనకాద్రిపల్లె మహిళా పోలీసు జైత్ర శ్రీజారెడ్డి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడింట్‌గా ఎన్నిక కాగా నంద్యాల జిల్లా సెక్రటరీగా విజయలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కళావతి, ఉపాధ్యక్షురాలిగా లలితమ్మ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా మాబున్ని, అత్తర్ గౌషియా, ట్రెజరర్‌గా సుజాత, తేజ, కుషల కుమారి, రేవతి, మైమున్నిసా, ప్రసన్న, శకుంతల, ఇంద్రావతి, జయంతి, యశోదరాణి, హారికలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీజారెడ్డి తెలిపారు.

గిరిజనుల కల నెరవేర్చిన సీఎం జగన్



మాట్లాడుతున్న రాజునాయక్

నంద్యాల(అర్బన్): రాష్ట్ర చరిత్రలో ఎన్నడూని విధంగా గిరిజనులకు సముచిత స్థానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కొనియారు. ఇటీవల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించి గిరిజనుల హృదయాల్లో నిలిచారన్నారు. స్థానిక జీపీఎస్ కార్యాలయంలో బుధవారం సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. రవినాయక్, బాలునాయక్, శంకర్‌నాయక్, మల్లేష్‌నాయక్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

బొమ్మలసత్రం: నంద్యాల సెబ్ అధికారుల దాడుల్లో పట్టుబడిన పది వాహనాలను వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ నాగమణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన కారు, ఆటో, ద్విచక్ర వాహనాలను వేలం లో ఉంచుతున్నామన్నారు. ఆసక్తిగల వారు రూ.3వేల దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

అంతర్జాతీయ కళాయజ్ఞంలో కోటేష్‌కు అవార్డు

నంద్యాల(అర్బన్): హైదరాబాద్‌కు చెందిన ప్రసిద్ధ చిత్రకారుడు శేష బ్రహ్మం కళాయజ్ఞంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి చిత్రప్రదర్శన పోటీల్లో నంద్యాల ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్‌కు స్థానం దక్కింది. గత ఏడాది డిసెంబర్ 11 – 31వ తేదీ వరకు దాదాపు 21రోజుల పాటు ఆర్ట్ చాలెంజ్ ఏర్పాటు చేసిన 21 అంశాలతో రోజుకో చిత్రంతో 21 చిత్రాలు గీసే పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీలకు దాదాపు 4వేల మంది చిత్రకారులు హాజరు కాగా అందులో కళాయజ్ఞ హైలీ కమాండబుల్ అవార్డులకు 21మందిని ఎన్నుకున్నారు. వారిలో కోటేష్ స్థానం సంపాదించారు. మార్చిలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

అడవికి నిప్పు పెడితే చర్యలు

ఆళ్లగడ్డ: అడవికి నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవని చాగలమర్రి మండలం అటవీ శాఖ అధికారి కిశోర్ కుమార్ తెలిపారు. చాగలమర్రి మండలం పెద్దవంగళి గ్రామంలో బుధవారం అడవికి నిప్పు.. అది మనకే ముప్పు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో దండోరా వేయించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ నాగేష్, నరసింహ, రాయుడు, నర్సయ్య ఉన్నారు.

గడ్డివామి దగ్ధం

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రిలో ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైంది. బస్టాండ్ వెనుక భాగంలో ఊశేన్‌వలి అనే వ్యక్తి గడ్డివాము వేసుకున్నాడు. బుధవారం పశువులకు మేత తెచ్చేందుకు వెళ్లగా మంటలు కనిపించడంతో గట్టిగా కేకల వేయగా స్థానికులు వచ్చి మంటలను అదుపు చేసేందుకు యత్నించినప్పటికీ అదుపుకాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

రైతు ఆత్మహత్య



మృతి చెందిన మధుప్రతాప్

శిరివెళ్ల: మహదేవపురం గ్రామానికి చెందిన రైతు గజ్జల మధుప్రతాప్ (34) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఏఎస్ఐ అబ్దుల్ వహాబ్ తెలిపారు. రైతు తనకున్న ఎకరా సొంత భూమితో పాటు మరో రెండు ఎకరాలు రెండేళ్ల నుంచి కౌలుకు తీసుకుని మునగ పంట చేస్తున్నాడు. పంట దిగుబడి రాక, పెట్టిన పెట్టుబడి చేతికి రాక రూ.9 లక్షలు అప్పులు చేశాడు. వాటిని చెల్లించే అవకాశం లేకపోవడంతో మానసిక ఆవేదనకు లోనై ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రైతులకు అవగాహన కల్పించాలి

గోస్పాడు: జొన్న దిగుబడులను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయనుందని, ఈ విషయంపై సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ తెలిపారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక రైతు భరోసా కేంద్రాల ద్వారా జొన్నలను కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని చెప్పారు. కనీస మద్దతు ధర క్వింటా రూ.2970 ప్రకారం చెల్లిస్తుందన్నారు. రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో దాదాపు 4,376 ఎకరాల్లో జొన్నపైరు సాగైందని, విక్రయాలకు రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలి

నంద్యాల(రూరల్): మండలంలోని గ్రామాల్లో ఉండే అర్హులైన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎన్ఆర్ఈజీఎస్ మండల అధికారులు, టీఏలు, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది కూలీల సంఖ్యను అధికంగా పెంచాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వీడి మస్టర్ల విషయంలో అవకతవకలకు తావు లేకుండా పనిచేయాలన్నారు. ప్రతి ఉపాధి కూలీకి 200 నుంచి రూ.250 వచ్చే విధంగా మస్టర్లు వేయాలని చెప్పారు. ఏపీఓ శ్రీకళ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వం పెద్ద పీట
- ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో 14మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలే
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా రవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తుందని, సామాజిక న్యాయం పాటిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు.బుధవారం పట్టణంలోని శిల్పా స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవులను కేవలం కొన్ని వర్గాలకు మాత్రమే కేటాయించిందని, ప్రస్తుతం మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయాన్ని పాటిస్తూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఓట్ల కోసం, అధికారం కోసం కాకుండా వారి అభ్యున్నతి కృషి చేస్తున్నారని చెప్పారు. పాదయాత్ర సందర్భంగా అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తానని నాడు చెప్పిన మాటకు కట్టుబడి పదవుల విషయంలో అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కుటుంబంలోని మహిళలపై ఎల్లో మీడియా వార్తలు ప్రచురిస్తున్నాయని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎల్లో మీడియా అధిపతుల కుటుంబాల్లో కూడా వ్యక్తిగత విషయాలు చాలా ఉన్నాయని, వాటిని మీ పత్రికల్లో ఎందుకు రాయడం లేదని ప్రశ్నించారు. వ్యక్తిగత వార్తలు రాసి జర్నలిజం విలువలను తగ్గించొద్దని హితవు పలికారు. ప్రజలకు ఉపయోగపడే వార్తలు రాస్తేనే మీ పత్రికను చదువుతారని, కేవలం అవాస్తవాలు, కల్పితాలను రాస్తే చదవరనేది గుర్తెరగాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించారని, ఇందులో 14 మంది ఎస్సీ,ఎస్టీ,బీసీ,,మైనార్టీ వర్గాలకు చెందిన వారున్నారని, ఆయా వర్గాలను చట్ట సభలకు వెళ్లేందుకు అవకాశం కల్పించడంలో సీఎంకు చిత్తశుద్ధి ఎంత ఉందో అర్థం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్ చంద్రశేఖర్, నాయకులు బాబురావు,విజయేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్ ప్రతి అడుగులోనూ అంబేడ్కర్ భావజాలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి అడుగులో అంబేడ్కర్ భావజాలం ప్రస్ఫుటంగా కనిపిస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు పెద్ద పీట వేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గత పాలకులు బీసీలంటే వెనుకబడిన తరుగతులుగా, కేవలం ఓటు బ్యాంక్‌గా భావించారని, నేడు బీసీ లంటే బ్యాక్‌బోన్ క్యాస్ట్ పరిగణిస్తూ వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుండటాన్ని గమనించాలన్నారు. చంద్రబాబు బీసీలను తన అధికారం కోసమే వినియోగించుకున్నారని, వారికి ప్రస్తుతం ఇస్తున్నంత ప్రాధాన్యత, ఉన్నత పదవులు కట్టబెట్టారా అని ప్రశ్నించారు. 18 ఎమ్మెల్సీ స్థానాలకుగాను 14 ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించడం సీఎం జగనన్న ఆవిష్కరించిన సామాజిక విప్లవమని తెలిపారు. రాజ్యాధికారంలో బీసీలకు వాటా కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సామాజిక న్యాయం అనే పదాన్ని నినాదంలా కాకుండా తమ విధానమని చాటిచెబుతుండటం గమనార్హమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చెన్నయ్య ఉన్నారు.

బిల్లు ఇప్పించండి సార్..

ఉయ్యాలవాడ : మండలంలోని హరివరం గ్రామానికి చెందిన అన్నవరం లక్ష్మిదేవి తాను నిర్మించుకున్న గృహానికి బిల్లు ఇప్పించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావును బుధవారం కోరారు. ఆమె మాట్లాడుతూ తనకున్న 3.50 సెంట్ల స్థలంలో ప్రభుత్వ అనుమతితో ఇల్లు నిర్మించుకోగా 2017 జూలైలో రూ.18,000 బిల్లు మంజూరు చేసిందన్నారు. ఈ బిల్లును సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంటు సురేఖ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరామయ్య బాల ఓబులేస్ అనే వలంటీర్‌కు జియో టాగింగ్ చేయడంతో ఆయన బిల్లు తీసుకున్నాడన్నారు. వారిపై చర్యలు తీసుకొని బిల్లును చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు.

రథసారథులుగా మారాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి గృహ సారథులు రథసారథులు కావాలని ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. పాలనను మరింతగా ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా గృహ సారథులు కృషి చేయాలన్నారు. స్థానిక ప్రథమనందిలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో బుధవారం గృహ సారథులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్ పరిధిలోని గృహ సారథులు వారికి కేటాయించిన 50 కుటుంబాలకు సంబంధించి అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా సేవ చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని చెప్పారు. వచ్చే నెల 18 నుంచి గృహ సారథులు ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిష్యత్ అనే ప్రచార కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. అలాగే జగనన్న సందేశం ప్రతి ఇంటికీ చేరవేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, దేశం సుధాకర్‌రెడ్డి, జాకీర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పార్వేటోత్సవం



హరినగరం సమీపంలో అహోబిలం రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు



విద్యుత్ దీపాలతో నరసింహ స్వామి చిత్రం



పల్లకీ కొలువు దీర్చేందుకు ఇస్కాన్ వారు ఏర్పాటు చేసిన మండపం

రుద్రవరం: అహోబిలేశుడి పార్వేటోత్సవం గురువారం రాత్రితో ముగియనుంది. జనవరి 16న అహోబిలం నుంచి ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామి వారు పల్లకీలో కొలువు దీరి ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, రుద్రవరం మండలాల్లోని 33 గ్రామాల్లో పర్యటించి భక్తుల నుంచి విశేష పూజలందుకున్నారు. ఉత్సవం చివరి మజిలీలో భాగంగా రుద్రవరం చేరుకుంది. గ్రామంలో రెండు రోజుల పాటు వివిధ కాలనీల్లోని తెలుపులపై కొలువు దీరిన స్వామి వార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి స్వామి వారి పల్లకీ అటవీ శాఖ కార్యాలయ ప్రాంగణంలోకి చేరుకుంటుంది. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాలు పూర్తవగానే బోయీలు పల్లకీని కాలి బాటన అహోబిలానికి మోసుకెళ్లేందుకు ఆలయ నిర్వాహకులు సిద్ధం చేశారు. అయితే 8 కి.మీ దూరం మోసి గండ్లేరు సమీపంలోని సాయిబాబ మందిరం వద్ద ఆళ్లగడ్డ–అహోబిలం ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి చేరుకుంటారు. రోడ్డెక్కగానే పల్లకీ కాసేపు అక్కడ కొలువు దీర్చి బోయీలు సేద దీరి తిరిగి మోసేవారు. అలా అలసిన బోయీలను సేద దీర్చేందుకు ఇస్కాన్ ట్రస్టు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం వసతులు,అల్పాహారం,సాంస్కృతిక కార్యక్రమాలు, బోయీలకు దుస్తులు పంపిణీ వంటివి చేపట్టనున్నారు. అక్కడ భజన కార్యక్రమాలు పూర్తవగానే శుక్రవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు చేసి వీడ్కోలు పలుకుతారు.